
# కాయిన్ ఫోన్!

వేదాంతం శ్రీపతిశర్మ



**ఆ** మనిషి ఆ టెలిఫోన్ దగ్గరికి ఎన్నిసార్లు వెళ్లివస్తున్నాడో లెక్కలేదు. ఖాళీగా కనిపించినప్పుడల్లా అలా వెళ్లి రిసీవర్ తీసి అందులోకి రూపాయి నాణెం తోసి ఏదో నెంబర్ కొడుతున్నాడు. ఎవరూ ఫోన్ ఎత్తడంలేదు కాబోలు. చాలా ఏకాగ్రతతో దానిని పట్టుకుని మరల అక్కడే పెట్టేసి తన రూపాయి వెనక్కి తీసుకుని వచ్చి నా పక్కన కూర్చుంటున్నాడు. చేతులు కట్టుకుని ఏదో ఆలోచిస్తున్నాడు.

ఇళ్లకంటే బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు కళకళలాడుతూ హాయిగా వున్నాయి. పదిమందీ కనిపిస్తున్నారు. ఒక సజీవమైన సమాజంలో వున్నందుకు ఎంతో గర్వంగా వుంది. ఇక్కడే టీ.వీ. వుంది, దాహానికి మంచినీళ్లు వున్నాయి. తినటానికి ఏది కావాలంటే అది వుంది. టాయిలెట్స్ వున్నాయి... ఒకటేమిటి? అన్నీ వున్నాయి. ఇళ్లల్లో కంటే మనుషులు బజార్లలోనే ఎక్కువ వుంటున్నారనిపిస్తోంది. అంతా సమాచారమే. కష్టపడి ఇందులోనే సదాచారాన్ని వెతుక్కుంటూ వుండాలి.

ఈయన మరల లేచాడు. వయసు

మీదపడింది. ముందుకు వంగిపోయి వున్నాడు. చిత్రమైన బెర్ముడా షార్ట్స్ తొడిగాడు. హవాయి చెప్పులు కాలికి సింపుల్‌గా వున్నాయి. టీషర్ట్ ప్రకృతి సహజంగా ఎయిర్ కూలింగ్ ఇస్తోంది. జాగ్రత్తగా ఫోన్ తీసి నాణెం అందులో వేసి నెంబర్ నొక్కాడు. కళ్లు మూస్కుని ఏదోపాట వింటున్నట్లు రింగ్‌టోన్ వింటున్నాడు. లాభం లేదని దానిని పెట్టేసి రూపాయి వెనక్కి తీసుకుని వచ్చేశాడు. ఎవరికో సమో పాపం! ఎవరు రావాలో అక్కడికి!

మరల వచ్చి పక్కన కూర్చున్నాడు.

'ఎక్కడికి వెళ్లాలండీ?' అడిగాను.

'మీరు నన్నేనా అడిగారు?'

'అవునండీ'

'మీరు చెయ్యి చూస్తారా?'

'లేదండీ'

'అయితే నేను సమాధానం చెప్పను. సారీ'

'అదేంటి?'

'ఎక్కడికి వెళ్లాలి, ఎక్కడినుంచి వచ్చావు – ఈ రెండింటినీ మరచిపోతేగానీ మనకు సుఖంలేదు!'

జీవితంలో దెబ్బతిన్నవాడో లేక జీవితాన్ని అడ్డగోలుగా భావించి అడ్డంగా తల బాదుకున్నాడో అనిపించింది.

'ఏదీ లేకుండా ఇలా బస్‌స్టేషన్‌లో ఏం చేస్తున్నారు సార్?'

'పొద్దుటనుండీ ఆ ఫోన్ చేస్తున్నాను. మీరు చెయ్యకూడదంటే చెప్పండి, మరేం ఫర్వాలేదు. మరో చోటికి వెళ్లిపోతాను'.

'మరీ బావుంది. ఏదైనా చెప్పడానికి నేనెవర్ని?'

నేను లేచాను. నన్ను గట్టిగా పట్టుకుని కూర్చోబెట్టాడు. గట్టిగా నవ్వాడు. పట్టుకున్న చెయ్యిని తన వైపుకు తిప్పుకుని హస్త సాముద్రికం చూస్తున్నట్టు పరీక్షించాడు. నా కళ్లలోకి చూసి ఏదో అర్థమయినట్లు తల ఆడించాడు.

'అందరూ ఇంతే. తప్పించుకుని పారిపోయేవాళ్లే. దేశమంతా ఇలానే వుంది. మీరు ఇంతవరకూ న్యూస్‌పేపర్ చదివారు. అవునా?'

'నేను కాదు. సగం పేపరు మీరు అటునుంచి చదివారు.'

'ష్!' అంటూ వేలు నోటిమీద పెట్టాడు. చెయ్యి వదిలి కళ్లు మూస్కుని చేతులు కట్టుకున్నాడు.

'మీరు ఇప్పుడే కొంత డబ్బు ఖర్చుపెట్టారు.'

'అవునులెండి. టికెట్ కొన్నాను!'

'సైలెన్స్, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయి.'

'అది చెప్పడానికి నా చెయ్యి చూడనక్కరలేదు'

నా చెయ్యి మరల పట్టుకుని లోతుగా చూశాడు.

'మీరు ఎక్కువగా మాట్లాడతారు' అన్నాడు.

చెయ్యి వెనక్కి లాక్కుని కళ్లు మూసుకున్నాను. కళ్ల ముందర చిటికె వేశాడు.

'మీ నెంబరే ఎందుకు సార్ అన్నిసార్లు కొట్టుకుంటున్నారు?' 'అలవాటయిపోయింది. బ్రతుకంతా నా మాటలు నాకే చెప్పుకున్నాను. నాతోనే మాట్లాడుకున్నాను. అయినా అలసిపోను. రిటైరయినా టైర్ మార్చుకుని నడుస్తూనే వుంటాను.'

'ఇటు చూడండి, ఆ కుర్రాడు ఆ ఫోన్ దగ్గరకు వెళ్లాడు చూశారా? అతని గురించి చెప్పమంటారా?'

'నేను వద్దంటే మీరు ఊర్కోరు కదా?'

'గుడ్. వినండి. అతను చేసిన నెంబర్ సరైనది కాదు. కాయిన్ వెనక్కి వచ్చేసింది. అదుగో వచ్చేస్తున్నాడు.'

'ఇంకొకటి అయివుండచ్చు కదా? అవతలి పక్కన ఎవరూ మాట్లాడి వుండరు.'

'నో! ఇతని వెనుక ప్రతిసారీ నేనే వెళ్లి చేస్తున్నాను. రీడయల్ కొట్టినప్పుడల్లా మీ మొహం మీరు అద్దంలో చూసుకోండి అని సందేశం వినిపిస్తోంది.'

'అంటే ఇన్నిసార్లు మీరు ఆ నంబర్ చేస్తున్నారా? తప్పుకదండీ?'

'నాన్‌సెన్స్. తప్పు అతనిది. సరైన నెంబర్ కాదని తెలిసి కూడా అతను అదే ఎందుకు చెయ్యాలి?'

'మీకసలు ఫోన్‌తో పనిలేదా? నాకు లెక్క తేలటం లేదు.'

'తేలదు. మునుగుతుంది. నాకు రూపాయి ఎవరిస్తారు?'

'మీ దగ్గర వుందికదా?'

'అది వెనక్కి వచ్చేస్తోంది!'

'శ్రీరామచంద్రా!'

'వస్తున్నాను. ఇప్పుడే ఆ కాయిన్ ఫోన్‌లో మాట్లాడి వస్తాను.'

మరల లేచాడు. నా కళ్లముందే అక్కడిదాకా వెళ్లి ఆ పోలీసును జాగ్రత్తగా చూసుకుంటూ ఫోన్‌లో కాయిన్ వేసి నెంబరు కొట్టాడు. ఈసారి 'హలో' అంటాడేమో అనుకున్నాను. అలాంటిదేమీ లేదు. నడుము మీద దర్జాగా చెయ్యిపెట్టి నన్ను ఓ కంట కనిపెడుతున్నాడు. రిసీవర్ పెట్టేసి ఆ కాయిన్ వెనక్కి వచ్చేవరకూ ఆగి సంతోషంతో వెనక్కి తీసుకుని జేబులో పెట్టుకుని వచ్చి కూర్చున్నాడు.

ఈ వ్యవస్థ లాభంలేదన్నట్లు విసుగ్గా తల అటూ ఇటూ తిప్పి చేతులు కట్టుకుని కళ్లు మూసుకున్నాడు.

***

రోజులు నిజంగానే మారిపోయాయి. వస్తువులూ వాయిదాలే, పనులూ వాయిదాలే! మాటలూ ఇన్‌స్టాల్‌మెంట్సే. టీ.వీ. ఇన్‌స్టాల్‌మెంట్స్, అందులోని కార్యక్రమాలూ ఇన్‌స్టాల్‌మెంట్సే. నిద్ర కూడా ఎవరికీ పూర్తిగా పట్టదు. కొంచెం కొంచెం. సంతోషం, సంతాపం అన్నీ ఇన్‌స్టాల్‌మెంట్స్. రూపాయితో మాట్లాడాలంటే కొద్దిగానే మాట్లాడాలి. జీవితమంతా బ్రేక్సే!

అలా ఆ బస్‌స్టేషన్‌లో కొంచెం కొంచెం నిద్రపోతూ ఆ స్తంభానికి ఆనుకుని కూర్చున్నాను. ఏదో సమాచారం మైకులో వినిపించేసరికి మరల మెలకువ వచ్చింది. ఆ ఫోన్ మనిషి ఎక్కడున్నాడా అని చూశాను. భుజం మీద బరువుగా అనిపించి ఉలిక్కిపడ్డాను. నన్ను ఆనుకుని చక్కగా నిదురిస్తున్నాడు. జీవితంలో ఒక్కరికైనా ఆశ్రయం ఇవ్వగలిగినందుకు క్షణంలో గర్వపడిపోయాను. ఆయనా లేచాడు. లేస్తూనే తిన్నగా ఎదురుగా వున్న ఆ ఫోన్‌వైపు నడిచాడు. నా భుజం కొద్దిగా తడిమి చూసుకున్నాను. తడి లేదని తేరుకుని దేవుడున్నాడని కూడా తేల్చేశాను. ఆయన ఆ ఫోన్ మరల పెట్టేసి రూపాయి కాయిన్ తీసేసుకుని పక్కన వచ్చి కూర్చున్నాడు.

ఇంక లాభం లేదని నేనే ఆ ఫోన్ దగ్గరికి వెళ్ళి రూపాయి కాయిన్ పట్టుకుని రిసీవర్ తీశాను. 'కాయిన్ ప్లీజ్' అని వెలిగింది. ఈయన ఏ నెంబర్ కొడుతున్నాడా అని తెలుసుకుందామని రీడయల్ కొట్టాను. అది మొబైల్ నెంబర్ వచ్చింది. రింగ్ మ్రోగుతోంది. అరె, నెంబర్ కొట్టాను కానీ ఎవరైనా హలో అంటే ఏం చెప్పాలి? ఇదేంటి? నాకెందుకు ఈ పిచ్చి? ఎవరో హలో అన్నారు. కాళ్లు వణికాయి.

'హలో, మీరు ఎవరికోసమైనా బస్‌స్టేషన్‌కి వెళ్లాలండీ? ఒక పెద్దాయన...'

'నీకు బుద్ధి, జ్ఞానం లేవు!'

'సార్... నేను'

'నేను ఎక్కడికీ వెళ్లక్కరలేదు. నేను బస్‌స్టేషన్‌లోనే వున్నాను. నాలుగు అడుగుల దూరంలో లేవు! సాటిలైట్ ద్వారా నాతో మాట్లాడి నీ గొప్ప చూపాలా? వెనక్కి తిరుగు. ఆ నెంబర్ నాది!'

వెనక్కి తిరిగాను. ఆ పెద్దాయన సెల్‌ఫోన్లో మాట్లాడుతూ నవ్వుతున్నాడు. ఫోన్ పెట్టేసి అటు నడిచాను. అంటే ఇంతసేపూ తన నెంబర్‌కే ఫోన్ చేస్కుంటున్నాడా?

'మీ నెంబరే ఎందుకు సార్ అన్నిసార్లు కొట్టుకుంటున్నారు?'

'అలవాటయిపోయింది. బ్రతుకంతా నా మాటలు నాకే చెప్పుకున్నాను. నాతోనే మాట్లాడుకున్నాను. అయినా అలసిపోను. రిటైరయినా టైర్ మార్చుకుని నడుస్తూనే వుంటాను.'

తలుపులు తెరిచి చూడాలేగానీ ప్రతి వ్యక్తిలోని చరిత్ర ఒక ఇంద్రభవనం – ఒక మ్యూజియం. అన్నీ దాచుకుని మూటకట్టుకున్న అనుభూతులే. ఈయన మనసు మరీ అద్దాల మహల్‌లా వుంది. ప్రతిబింబాలు కదిలిపోతున్నా అవి జాగ్రత్తగా నాకు చూపిస్తున్నాడు.

'నేను చాలా గొప్పవాడ్ని!'

'ఎందువలన సార్?'

'నా కాయిన్ ఎల్లప్పుడు వెనక్కే వచ్చేస్తుంది. అందరూ కలిసి నా ఒక్కడికే చెప్పాలని ప్రయత్నించారు. నేను చెప్పేది వినాలని ఎవరికీ అనిపించలేదు.'

'మీరు నిరాశకు లోనయ్యారు. అంతకంటే మరొకటి కాదు'

'మరేం ఫర్వాలేదు. నేనేమైనానో ఏమో... కొద్ది రోజులలో ఎక్కడో కలిసిపోతాను. ముచ్చటైన నాలుగు మాటలు పంచుకోలేని ఈ జనాన్ని చూడండి, మీ సంఘాన్ని గమనించండి!'

అటూ ఇటూ చూశాను. బస్‌స్టేషన్ నిండా జనం వున్నారు.

'అందరూ కళకళలాడుతున్నారు సార్'

'లేదు. నాకు ఎడారిలా వుంది. ప్రతి వ్యక్తి నన్ను కాకుండా లెక్క వేసుకోమనే కాక్టస్ మొక్కలా వున్నాడు. తాకితే రక్తపాతమే!'

ఇంతలోనే లేచాడు. మరల టెలిఫోన్ దగ్గరకెళ్ళి అందులో కాయిన్ వేశాడు. నెంబర్ నొక్కాడు. నా పక్కనే ఆయన వదిలేసిన మొబైల్ మోగింది. అది తీసి 'హలో' అన్నాను.

'మీ పక్కన ఒక బాగ్ వుంది. తెరిచి చూడండి. ఫర్వాలేదు. బాంబ్ లాంటిది ఏదీ లేదు'.

జాగ్రత్తగా తీసి చూశాను. అందులో ఒక ఆపిల్ వుంది.

'ఎన్ని ఆపిల్స్ వున్నాయి?'

'ఒక్కటే వుంది'

'పెళ్లయిన కొత్తల్లో రెండు కొనేవాడ్ని!'

మరో రూపాయి కాయిన్ అందులో వేసి మాట పొడిగించాడు.

'ఇద్దరు పిల్లలు పుట్టాక నాలుగు కొనేవాణ్ణి. అమ్మాయి అత్తారింటికి వెళుతున్నప్పుడు అప్పగింతలలో ఏడుపు రాలేదు. కానీ వెళ్లిపోయాక పొరపాటుగా నాలుగు ఆపిల్స్ కొనేసి భోరుమని ఏడ్చాను. ఇంట్లో ఒక సంఖ్య లేదు కదా అని బాధపడ్డాను!'

'సార్, ఆ ఫోన్‌లో ఎందుకండీ? ఇక్కడికి వచ్చి చెప్పండి ప్లీజ్!'

'వద్దు. ఇందులోంచే చెప్పాలి. కోడలు వచ్చిందని మరల నాలుగో ఆపిల్ కొన్నాను. ఆపిల్స్ ఇక్కడ కాదు, అమెరికాలో బావుంటాయి అని ఎందుకో వాళ్లు అక్కడికి వెళ్లిపోయారు. మరల రెండే కొన్నాను. ఇప్పుడు ఎన్ని వున్నాయి?'

'సారీ సార్, ఒకటే వుంది'.

వెనక్కి వచ్చాడు. 'చాలా థాంక్స్' అన్నాడు.

'ఎందుకు?'

'నా మాటలు విన్నందుకు. మీ చెయ్యి ఇలా ఇవ్వండి.'

'వద్దండీ. ఆ ఆపిల్ మీరు తినండి'

'నోనోనో. ఈ ఆపిల్ నాదే. షోలే సినిమాలో లాగా ఈ రూపాయి కాయిన్ రెండువైపులా నా బొమ్మే! నేనే వ్యక్తిని, నేనే సమాజాన్ని. నాది నాకే వెనక్కి వస్తుంది.'

'ఈసారి రెండు కాయిన్స్ వాడారు. మాట్లాడారు కదా?'

'మీరు మంచివారు సార్. ఇలా నాలాంటి వాళ్లతో మాట్లాడుతూ వుండండి! ఒంటరిగానే పుడతాం. ఒంటరిగానే పోతాం. మధ్యలోనిది సర్వం మిథ్య! ఈ కాయిన్‌లాగా లోపలికెళ్లి చెక్కుచెదరకుండా వెనక్కి వచ్చేస్తాం. మాట్లాడితేనే ఖర్చు, సమస్యలు, సమాజం...'

ఆ కాయిన్ నా చేతిలో పెట్టాడు.

'శుభం. చెయ్యి చూపించిన వాడికి గీతలు చదివి దక్షిణ ఇచ్చేది నేనే. మీరు త్వరలో బస్ ఎక్కుతున్నారు' అని గట్టిగా నవ్వాడు.

నా బస్ ఎక్కి ఆయన్నే గమనిస్తూ కూర్చున్నాను. నా చోట్లో ఎవరో వచ్చి కూర్చున్నారు. ఆయన లేచి మరల ఫోన్‌వైపు వెళుతున్నాడు. బస్ కదిలింది. దూరమవుతున్నా జాగ్రత్తగా చూస్తున్నాను. అందులో కాయిన్ వేసి నెంబర్ కొట్టి నడుము మీద చెయ్యి పెట్టాడు. చూసేవాళ్లకి అది ముఖ్యమైన పని ఏదో చేస్తున్నట్లుంటాడు... ముఖ్యమైనదే!

★

## అతిగా ఆలోచిస్తే!

అవసరానికి మించి ఆలోచించడమనేది శరీరాన్ని జబ్బుల మయం చేసుకోవడమేనని ఇటీవలే పెన్సిల్వేనియా డాక్టర్ల బృందం తేల్చి చెప్పింది.

★ అవసరం లేనివి, మనకు దక్కని వాటి గురించి ఆలోచించ కూడదు.

★ ఇక విపరీతంగా ఆలోచించడం వలన ముప్పయ్యేళ్ళు దాటిన వెంటనే మెదడుకు సంబంధించిన జబ్బులతో బాధపడతారు.

★ వ్యాధినిరోధక శక్తి కారకాలు కూడా పటుత్వాన్ని కోల్పోయి మనకు ఉపయోగపడకుండా పోతాయి.

★ అతిగా ఆలోచించడం వలన దేనిపైనా సరిగా దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడుతుంది.

★ మెదడుకు సంబంధించిన అంశాల విషయంలోనే గాకుండా, కంటిచూపు విషయంలోనూ కాస్త వ్యతిరేకత ఏర్పడుతుందని, కంటిచూపు వయసుకు ముందే మందగించడం జరుగుతుంది.

★ ప్రతిరోజూ సమయానికి మించి ఆలోచించడం వలన మధుమేహ వ్యాధి కూడా వచ్చే ప్రమాదముందని చెబుతున్నారు.

చేయబోయే పనిగురించి గానీ, సందర్భోచితంగా వ్యవహరించాల్సి వచ్చినప్పుడు, కెరీర్‌కు సంబంధించిన సమయంలో ఆలోచించడం తప్పని సరిగానీ, ఎప్పుడూ నెగిటివ్‌గా ఆలోచించడం మొదలెడితే కెరీర్‌లో తిరోగమనమేననేది నిపుణుల అభిప్రాయం!

